మరమ్మతులు చేశారు..రోడ్డు క్లియర్ మరిచారు

అధికారుల నిర్లక్ష్యం.. వాహనదారుల అవస్థలు

హయత్‌నగర్‌లో నేతాజీ కాలనీ కమాన్ వద్ద మూసివేసిన రోడ్డు

హయత్‌నగర్, జనవరి 28: హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అందులో భాగంగా హయత్‌నగర్‌లోని హైవే బావర్చి ఎదురుగా, శ్రీరాఘవేంద్ర హోటల్ పక్కన, నేతాజీ కాలనీ కమాన్ ఎదుట వాటర్ వర్క్స్ అధికారులు గత నెలరోజులుగా వాటర్ పైపులైన్ మ్యాన్‌హోల్ మరమ్మతులు చేపట్టారు. కానీ నేతాజీ కాలనీకి వెళ్లే రోడ్డును మూసి ఉంచడంతో బంజారాకాలనీ, డిఫెన్స్ కాలనీ, అన్మగల్ హయత్‌నగర్, మునగనూరు, తొర్రూర్ గ్రామాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హైవే రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడం కారణంగా అధికారులు వర్డ్ అండ్ డీడ్, తొర్రూరు చౌరస్తా, భాగ్యలత కాలనీ వద్ద యూటర్న్‌లు మూసివేయడంతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. హైవే అథారిటీ అధికారులు, ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు జెడ్పీహెచ్ఎస్ స్కూల్ వద్ద నుంచి ఓల్డ్ హయత్‌నగర్ రోడ్డులో వెళ్తున్నారు. రూట్లు తెలియని కొందరు వాహనదారులు ఎటువైపు నుంచి వెళ్లాలో తెలియక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి నేతాజీ కాలనీ వద్ద రోడ్డును క్లియర్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు క్లియర్ సమస్యను పరిష్కరించాలి

నేతాజీ కాలనీ కమాన్ వద్ద రోడ్డు మూసివేయడంతో హైవే బావర్చి వద్ద యూటర్న్ తీసుకుని ఓల్డ్‌హయత్‌నగర్, బంజారాకాలనీ, మిధానికాలనీ, డిఫెన్స్‌కాలనీ, మునగనూరు,తొర్రూర్ గ్రామాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారందరూ జెడ్పీహెచ్ఎస్ రోడ్డులో ఓల్డ్ హయత్‌నగర్ రోడ్డుకు వెళ్లాల్సి వస్తున్నది. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కరించాలి.

–సామ తిరుమలరెడ్డి, మాజీ కార్పొరేటర్ హయత్‌నగర్

సర్వీసు రోడ్డు వేశాక.. క్లియర్ చేస్తాం

హయత్‌నగర్‌లో విజయవాడ హైవే విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. నేతాజీ కాలనీ కమాన్ వద్ద వాటర్ వర్క్స్ మ్యాన్‌హోల్ మరమ్మతులు జరిగాయి. సర్వీసు రోడ్డు వేయగానే ఓల్డ్ హయత్‌నగర్‌కు వెళ్లే రోడ్డును క్లియర్ చేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

నేదునూరులో ప్రభుత్వ పాఠశాలలో నిరసన తెలుపుతున్న బషీర్, ఉపాధ్యాయులు

కందుకూరు, జనవరి 28: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్ సీపీఎస్ ఈయూ రంగారెడ్డి జిల్లా కోశాధికారి డాక్టరు బషీర్ తెలిపారు. మంగళవారం నేదునూరులో గల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో భోజన విరామ సమయంలో కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు చేయనున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీంలు మాకొద్దు అంటూ యూపీఎస్, సీపీఎస్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన పెన్షన్ విధానం వలన 30 ఏండ్లుగా ఉద్యోగం చేసిన వారందరి జీవితాలకు భద్రత లేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించి నూతన పెన్షన్ విధానం తీసుకురాకుండా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎచ్ఎం శ్రీనిఆస శర్మ, ఉపాధ్యాయులు ఎండీ అబ్దుల్లా, శ్రీవాణి, శ్రీశైలం, విజయమోహన్ రెడ్డి, సురేశ్, గ్లోరీ, శాంత కుమారి, కృష్ణ, కరుణాకర్, వెంకటేశ్, హసనోద్దిన్, పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలి

రోడ్డు భద్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉన్నట్లయితే ప్రమాదాల బారినపడకుండా ఉండవచ్చనని నాగోల్ ఇన్‌చార్జ్ ఆర్టీఓ అమర్‌నాథ్ అన్నారు. జాతీయ భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం నాగోల్ ఆర్టీఓ కార్యాలయం ఆధ్వర్యంలో నాగోల్‌లోని బీసీ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా 'ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం– రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐలు అనిత, వేణు, మురళీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

– మన్సూరాబాద్, జనవరి 28

వేల గొంతులు లక్ష డప్పుల సభను విజయవంతం చేయండి

ఎస్సీ వర్గీకరణ చేసే వరకు పోరాటం ఆగదు: మంద కృష్ణ

బడంగ్‌పేట, జనవరి28: ఫిబ్రవరి7న జరిగే వేల గొంతులు లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మాదిగలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపన అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు నిచ్చారు. మహేశ్వరం మండల కేంద్రంలో వేల గొంతులు, మహేశ్వరంలో వేల గొంతులు లక్ష డప్పుల సన్నాహక సమావేశం మంగళవారం రంగారెడ్డి జిల్లా ఎమార్పీఎస్ అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వాని సూచిస్తుందన్నారు. ఎస్సీలలో సమానత్వం సాధ్యం కావాలంటే ఎస్సీ వర్గీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో బాకాని రవి మాదిగ, మాజీ ఎంపీటీసీ అనుమగల చంద్రయ్య మాదిగ, యాదయ్య మాదిగ, మదిలేటి మాదిగ, రావుగళ్ల బాబు మాదిగ, కట్ట ప్రశాంత్ మాదిగ, కృష్ణ మాదిగ, రమేశ్ మాదిగ, మనోహర్ మాదిగ, గణేశ్ మాదిగ, అర్జున్ మాదిగ, శేఖర్ మాదిగ, బొర్ర రవి మాదిగ, మంద సాయిలు ఉన్నారు.

పోరాటాల ద్వారానే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం

టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు మామిడి సోమయ్య

వనస్థలిపురం, జనవరి 28: పోరాటాల ద్వారానే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమవుతాయని టీయూడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. సంస్థ వ్యవస్థాపక సభ్యుల సమావేశం మంగళవారం వనస్థలిపురంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కులు ప్రమాదంలో ఉన్నాయన్నారు. ఎన్నో సమస్యలున్నా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలపై స్పష్టత లేదన్నారు. జర్నలిస్టులపై దాడులు, హత్యలు జరుగుతున్నా ప్రత్యేక చట్టం తీసుకువచ్చేందుకు ప్రభుత్వాలు చొరవ చూపడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశం అనంతరం వ్యవస్థాపక సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్, బండి విజయ్‌కుమార్, వల్లాల జగన్, వెంకటేశ్వర్లు, యాదగిరి, శేఖర్, బాపురావు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 1వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 6వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. వివరాలు ఓయూవెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

మలక్‌పేట, జనవరి 28:చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చాదర్‌ఘాట్ పీఎస్‌లో కానిస్టేబుల్(పీసీ 31511)గా విధులు నిర్వహిస్తున్న ఎ.పవన్‌కళ్యాణ్ ఈనెల 24న బీసీ–1 పెట్రోలింగ్ వాహనంపై విధులు నిర్వహిస్తుండగా, మలక్‌పేట మెట్రోస్టేషన్ పక్కనున్న సవేరా హోటల్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడన్న స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న అతడు, ఆ వ్యక్తిని పరిశీలించగా అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి వెంటనే 108 అంబులెన్స్‌లో ఉస్మానియా దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, ఆ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కానిస్టేబుల్ పవన్‌కళ్యాణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉర్దూ అకాడమీ పథకాల నిధులను విడుదల చేయాలి

సైదాబాద్, జనవరి 28: ఉర్దూ అకాడమీ పథకాల నిధులను తెలంగాణ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని భీమ్ ఆర్మీ తెలంగాణ రాష్ట్రాధ్యకులు వనం మహేందర్, ముస్లిం మైనార్టీ విభాగం అధ్యక్షులు మహ్మద్ రఫీక్ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఉర్దూ భాష సంక్షేమంపై శ్రద్ధ కలిగి ఉందని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇమాంలకు, ముజ్జిన్‌లకు ఇప్పటి వరకు పారితోషికాలు అందించడంలేదన్నారు. ఉర్దూ అకాడమీ పథకాల కోసం కేటాయించిన నిధులు రెండేళ్లుగా విడుదల కాలేదని, ప్రభుత్వ తక్షణమే నిధులను మంజూరు చేయాలన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకొన్న లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమయ్యేందుకు నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు దాపరించాయని,ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల నిరసన

అచ్చంపేట మార్కెట్ కార్యదర్శిపై దాడికి నిరసనగా ఎల్బీనగర్‌లో ఆందోళన

ఎల్బీనగర్‌లోని వ్యవసాయ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయం వద్ద ఆందోళనలో పాల్గొన్న టీఎన్జీఓస్ ఎంఎంసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలుకా నర్సింహారెడ్డి, కార్యదర్శి ముక్రం, గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్ చిలుకా మధుసూదన్‌రెడ్డి తదితరులు

ఎల్బీనగర్, జనవరి 28: అచ్చంపేట్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిపై దాడికి నిరసనగాఎల్బీనగర్‌లోని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయం వద్ద టీఎన్జీఓస్ ఎంఎంసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలుకా నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ముక్రం మాట్లాడుతూ.. మార్కెట్ కార్యదర్శిపై దాడిని తీవ్రంగా ఖండించారు. మార్కెటింగ్ శాఖ విధులు నిర్వహిస్తున్న కార్యదర్శిపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు వెంకటేశం, కొశాధికారి చంద్రశేఖర్, సంతోష్, ఎల్. శ్రీనివాస్, రేవంత్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఖలీద్ తదితరులు పాల్గొన్నారు. ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి ఎల్.శ్రీనివాస్‌లు సంఘీభావం తెలిపారు.

మంజూరైన పనులు మొదలుపెట్టండి

జలమండలి అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి తదితరులు

సైదాబాద్, జనవరి 28: సైదాబాద్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మంజూరైన తాగునీటి, సీవరేజీ పైప్‌లైన్ల పనులను సత్వరమే మొదలు పెట్టాలని కోరుతూ సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి మంగళవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో మంచినీటి పైప్‌లైన్లు, సీవరేజీ పైప్‌లైన్ల ఇతర సమస్యల కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని అత్యవసర పనులుగా గుర్తించి నిధులను విడుదల చేసి పనులు మొదలుపెట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అలాగే డ్రైనేజీ లైన్లు క్లీన్ చేయడానికి డివిజన్‌కు ప్రత్యేకంగా మినీ ఎయిర్ టెక్ వాహనం మంజూరు చేయాలని కోరామని తెలిపారు. ఎండీ అశోక్ రెడ్డి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి సానుకూలంగా స్పందించి, వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని ఆమె తెలిపారు.

బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలి

హయత్‌నగర్ తహసీల్దార్‌కు బంజారాకాలనీవాసుల వినతి


హయత్‌నగర్ తహసీల్దార్ కె.జానకికి వినతిపత్రం అందజేస్తున్న బంజారాకాలనీవాసులు

హయత్‌నగర్, జనవరి 28: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బంజారాకాలనీలో రాత్రి, పగలు తేడాలేకుండా విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హయత్‌నగర్ మండల తహసీల్దార్ కె.జానకికి, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వెంకట్‌రెడ్డికి బంజారాకాలనీవాసులు వేర్వేరుగా మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంజారాకాలనీలో కిరాణ షాపుల పేరుతో అర్ధరాత్రి వేళల్లో మద్యం, గంజాయి, మత్తుపదార్థాలు విక్రయించడం వల్ల యువకులు, గుర్తుతెలియని వ్యక్తులు వీధుల్లో సంచరిస్తున్నారని తెలిపారు. రాత్రి పూట ఇళ్లల్లో నుంచి బయటికి రాలేని దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తులో చోరీలకు పాల్పడి దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. రాత్రి అయ్యిందంటే మహిళలు, విద్యార్థినులు బయటికి వెళ్లలేని దుస్థితి దాపురించిందన్నారు. అక్రమంగా కొనసాగుతున్న బెల్టుషాపులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వారిలో బంజారా కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మెగావత్ రఘుపతి నాయక్, మూడవత్ ఘుశిరం, కరంటోతు పాండు, మెగావత్ గోవర్ధన్ నాయక్, వర్త్య, బలరాం, కొర్ర గోపాల్, రమావత్ శంకర్, మకట్‌లాల్, చిన్య, వంకడోతు రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రధాన ప్రతి పక్షంగా ప్రభుత్వాన్ని నిలదీయడం తప్పా?

- సబితా ఇంద్రారెడ్డిపై విమర్శలు తగదు
- జంగారెడ్డికి రాజకీయ భిక్ష పెట్టింది సబితా ఇంద్రారెడ్డి కాదా?

కందుకూరులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

కందుకూరు, జనవరి 28: మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై విమర్శలు చేయడం కాంగ్రెస్ పార్టీ నాయకులకు తగదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్ తెలిపారు. ప్రధాన ప్రతి పక్షంలో ఉంటూ ప్రభుత్వాన్ని నిలదీయడం తప్పా? అని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహ రెడ్డి, కాకి దశరథ ముదిరాజ్‌లతో కలిసి మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ..సబితా ఇంద్రారెడ్డిని మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి విమర్శించడం సిగ్గు చేటన్నారు. రాజకీయ భిక్ష పెట్టింది సబితా ఇంద్రారెడ్డి కాదా? అని జంగారెడ్డిని ప్రశ్నించారు. నీవు ఇతర పార్టీలో ఉండి జడ్పీటీసీగా పోటీ చేస్తే 500 వందల ఓట్లు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సబితా ఇంద్రారెడ్డితో కలిసి బీఆర్ఎస్ పార్టీలో జడ్పీటీసీగా పోటీ చేసి గెలిచావని, అప్పటి నుంచి బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు చేర్చింది నీవు కాదా?అని ప్రశ్నించారు. నీ చేతుల మీదుగా అప్పటి పథకాలను పంపిణీ చేయలేదా? అని ప్రశ్నించారు. దళిత బంధు, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్‌ఫండ్ లాంటి పథకాల చెక్కువను పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. సబితా ఇంద్రారెడ్డిని విమర్శించే ముందు గత చరిత్రను తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మెప్పుపొందడానికి విమర్శలు చేయడం సమంజసం కాదని తెలిపారు. విమర్శలు మానుకొని ప్రజలకు హామీలను నెరవేర్చడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పొట్టి ఆనంద్, సురుసాని శేఖర్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తిక్, మాజీ డైరెక్టరు దేవీలాల్ నాయక్, మాజీ సర్పంచ్‌లు ద్యారంగుల జంగయ్య, రజిత ప్రవీణ్ నాయక్, మండల సోషల్ మీడియ కన్వీనర్ బొక్కదీక్షిత్‌రెడ్డి, సురుసాని సుదర్శన్‌రెడ్డి, మన్నేనరేందర్, మంచన రాజశేఖర్ గుప్తా పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి

తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్

మహాసభలో జ్యోతిప్రజ్వళన చేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్

హయత్‌నగర్, జనవరి 28: సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ప్రధాన సమస్యలను తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శి, ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ హామీనిచ్చారు. మంగళవారం హయత్‌నగర్‌లోని బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్స్ నందు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్(టీజీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్) 11వ రాష్ట్ర మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ మహాసభకు ముఖ్యఅతిథులుగా మల్‌రెడ్డి రాంరెడ్డి, ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ విచ్చేసి జ్యోతి ప్రజ్వళన చేసి మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం లేదని, మీ ప్రధాన సమస్యలైన ఆసరా పెన్షన్, తెల్లరేషన్ కార్డు, సూపర్ లగ్జరీ బస్సుల్లో భార్యభర్తలకు ఉచిత ప్రయాణం, రిటైర్డ్ ఉద్యోగి చనిపోతే అంత్యక్రియలకు అందించే రూ.30వేలు తక్షణమే అందించే విధంగా చూస్తామన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతంలో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు వెయ్యి గజాల స్థలం బిల్డింగ్ నిర్మించడానికి నిధులు మంజూరయ్యే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లి మీ ప్రధాన సమస్యలు పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ యం.ఏ.రెహమాన్ సోఫి, ప్రధాన కార్యదర్శి బి.వి.కోటయ్య, కోశాధికారి ఎస్.బుచ్చిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనందం, రాజయ్య, పిఎల్ఎన్ రావు, అయ్యన్నగౌడ్, పాండు రంగారావు, యాదగిరి, స్వామి, మల్లేశ్వరరావు, గోపాల్‌చారి, గోపాల్‌రెడ్డి, సత్తన్న చారి, యూసుఫ్, చెన్నారెడ్డి, ఖదీర్, వీర స్వామి, వెంకటేశం, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: ఓయూ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 6వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 11వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ అధికారులు తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

సంగీతంతో ఒత్తిడి దూరం

ఆర్కేపురం, జనవరి 28: సంకీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్ ఏడవ వార్షికోత్సవం సంగీత గురువు ఎం.సత్యవతి, కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సామాజిక సేవా వేత్త చిలుక ఉపేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి ఆధునిక కాలంలో పిల్లలకు చక్కని సంగీతం, సంస్కారం నేర్పించడానికి, మహిళలకు తమ రోజు వారి ఒత్తిడి నుండి ఆధ్యాత్మికత, ఉత్సాహం కలగలిపిన చక్కని వ్యాపకంగా ఈ సంగీత తరగతులు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంగ్ విశ్రాంత మేనేజర్ నరసింహరావు, జగదీశ్వర్, సోమయాజులు, మైసయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, మాధవరెడ్డి గంగాధర్ తదితరులు ఉన్నారు.

సంకీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్ వార్షికోత్సవంలో పాల్గొన్న చిలుక ఉపేందర్‌రెడ్డి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

అంతర్జాతీయ క్రికెట్ ఆటగాడు ఫజల్ ఆలం

హయత్‌నగర్, జనవరి 28: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు శారీర, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అంతర్జాతీయ క్రికెట్ ఆటగాడు ఫజల్